క్లుప్తంగా

రేపు ఉప సర్పంచ్ ఎన్నిక

మునుగోడు: మండలంలోని చీకటిమామిడి గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జానయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉన్న ఉప సర్పంచ్‌పై ఇటీవల మెజార్టీ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు అవిశ్వాసం పెట్టి నెగ్గడంతో ఈ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డు సభ్యులతో పాటు సర్పంచ్ ఉదయం 11 గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఉప సర్పంచ్ ఎన్నికలో పాల్గొనాలని సూచించారు.

31న సర్వసభ్య సమావేశం

మునుగోడు: మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 31న ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జానయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా జంగయ్య


ఎరసాని జంగయ్య

చిట్యాల: మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన ఎరసాని జంగయ్యను బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఆదిమల్ల గోవర్ధన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఆదిమల్ల గోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు పుదరి సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

నల్లగొండ టౌన్: బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ పరిపాలనాధికారి మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేశ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యకు కనీస ప్రాధాన్యతనివ్వడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో 10శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు వలమల్ల అంజనేయులు, నాయకులు మామిళ్ల అంజనేయులు, గంట గణేష్, సూర్య ఉన్నారు.

పేద విద్యార్థులకు సైకిళ్లు అందజేత


విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని బీటీఎస్‌లో గల డిస్ట్రిక్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(డైట్) ప్రాథమిక పాఠశాలలో 180 మంది విద్యార్థులకు శనివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు. అదే విధంగా 10 మంది పేద విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. పట్టణ సమీపంలోని లెప్రసీ కాలనీలో పేదలకు 120 మందికి టవల్స్, లుంగీలు అందజేసి భోజన వితరణ చేశారు. కార్యక్రమంలో సువర్ణ జయపాల్‌రెడ్డి, డాక్టర్ రఘువీర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, జయశ్రీ, శ్రీకాంత్, శోభ, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ


శాలిగౌరారంలో సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

శాలిగౌరారం: బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 52శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బహుజనులకు అధికారం దక్కేంత వరకు బహుజనులంతా ఏకమై రాజకీయ ఉద్యమం చేయాలన్నారు. స్వాతంత్ర్య వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా బహుజనులకు రాజ్యాధికారం అందని ద్రాక్షగానే మిగిలిపోయిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొడ్డు కిరణ్, చింతల చింతయ్య, కమటం శోభ, నవీన్, మండల అధ్యక్షుడు పాడేటి సైదులు, అంబేద్కర్, రాంబాబు, మహేశ్, లక్ష్మణ్, సైదులు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి మోక్షం

- గతంలో హైవే విస్తరణలో భాగంగా ఇనుపాములలో ఆలయం తొలగింపు
- మల్లన్న గుట్టపై తిరిగి నిర్మించేందుకు రూ.6.50 కోట్లు విడుదల


జాతీయ రహదారి విస్తరణకు ముందు పార్వతీ పచ్చల సోమేశ్వరస్వామి ఆలయం(ఫైల్)


మల్లన్న గుట్టపై కాలినడకన పర్యటిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య (ఫైల్)

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల గ్రామంలో గల శ్రీపచ్చల పార్వతీ సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి వెంట ఉన్న మల్లన్నగుట్టపై నూతన ఆలయ నిర్మాణానికి రూ.6.50 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకతీయుల కాలంలో క్రీ.శ. 13వ శతాబ్దంలో ఇనుపాముల గ్రామంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 2010 సంవత్సరంలో తొలగించారు. తొలగించిన ఆలయానికి నష్టపరిహారంగా ఎన్‌హెచ్‌ఏఐ అప్పట్లో రూ.38 లక్షలు మంజూరు చేసింది. జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్ పేరున బ్యాంకు ఖాతాలో జమ అయిన ఈ నిధులు నేటికి రూ.60లక్షలు అయ్యాయి.

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో..

నూతన ఆలయాన్ని స్థానిక మల్లన్న గుట్టపై నిర్మించాలని గ్రామస్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇందుకనుగుణంగా గుట్టపై 285 సర్వే నంబరులోని 1.38 ఎకరాల స్థలం అనువుగా ఉంటుందని గుర్తించిన రెవెన్యూ అధికారులు నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపారు. అయితే ఆ స్థలాన్ని దేవాదాయ శాఖకు స్వాధీనం చేసే విషయం మాత్రం ఏళ్ల తరబడి కొలిక్కి రాలేదు. దీంతో స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య రాష్ట్ర మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ నిర్మాణంపై జిల్లా రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. అధికారులతో కలసి ఎమ్మెల్యే కాలినడకన గుట్టపైన పర్యటించి ఆలయ నిర్మాణం చేపట్టేందుకు అనువైన స్థలాన్ని ఖరారు చేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను ప్రభుత్వానికి వివరిస్తూ ఆలయ పునర్నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం అధికారుల చేత ప్రతిపాదనలు రూపొందించి నివేదికలు పంపించారు. ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పలుమార్లు ప్రత్యేకంగా కలిసిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను వాహనాల్లో గుట్టపైకి తీసుకెళ్లేందుకు వీలుగా ఎమ్మెల్యే తన నిధుల నుంచి రూ.40 లక్షలు కేటాయించి ఫార్మేషన్ రోడ్డు వేయించారు.

రూ.6.50 కోట్ల నిధులు మంజూరు

మల్లన్న గుట్టపై నూతన ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.50 కోట్లు మంజూరు చేస్తూ ఈ నెల 25న ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఆలయాన్ని నిర్మించేందుకు రూ.5 కోట్లు, జాతీయ రహదారి నుంచి గుట్ట పైవరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయించారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో శివాలయం పునర్నిర్మాణం కోసం గత పదమూడేళ్లుగా ఎదురుచూస్తున్న ఇనుపాముల గ్రామస్తుల నిరీక్షణకు ఇక తెరపడనుంది. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు కావటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే కృషితోనే నిధులు..



వందల ఏళ్ల చరిత్ర కలగిన ఈ ఆలయాన్ని జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించారు. అప్పటి నుంచి ఆలయ పునర్నిర్మాణం కోసం స్థానిక ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కృషి వల్లనే నూతన ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గ్రామస్తులందరి తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– కానుగు యాదగిరి, శివాలయ కమిటీ చైర్మన్, ఇనుపాముల

మరో చెర్వుగట్టులా చేస్తాం



ఇనుపాములలోని శివాలయాన్ని మరో చెర్వుగట్టు క్షేత్రంలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. కొండపై అద్భుతంగా ఆలయ నిర్మిస్తాం. మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో ఆలయ చరిత్ర, నిర్మాణ ఆవశ్యకతను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించాం. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎంకు ధన్యవాదములు తెలుపుతున్నాం.

– చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్యే, నకిరేకల్

పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


చిట్యాల: తాళ్లవెల్లెంలలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల: దేశ వ్యాప్తంగా పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించిందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామంలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలకు అవసరమైన నిధులు మంజూరవుతున్నాయన్నారు. తాళ్లవెల్లెంల గ్రామ అభివృద్ధికి ఇప్పటి వరకు కోటి రూపాయల వరకు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలను సునీతావెంకటేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ జనగాం నర్సింహాగౌడ్, మాజీ సర్పంచ్ సుంకరి యాదగిరిగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లబెల్లి రమేష్, బత్తుల జనార్దన్, గోపగోని స్వామి, బత్తుల వెంకటయ్య, బోగరి నర్సింహ, మామిడాల పాండు, మాదగోని శివ, కొమ్మగోని భిక్షం పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతర వీడియో సాంగ్ ఆవిష్కరణ

కట్టంగూర్: కట్టంగూర్‌కు చెందిన యువ దర్శకుడు, ఆర్టిస్ట్ బొడ్డుపల్లి మహేష్(ఆర్‌కేఎస్) పెద్దగట్టు లింగన్న జాతర సందర్భంగా రూపొందించిన వీడియో సాంగ్‌ను శనివారం నార్కట్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, పామనగుండ్ల సర్పంచ్ సైదిరెడ్డి, పులిగిల వెంకన్న, కళ్యాణ్ ఉన్నారు.

పేదలకు ఇంటి రుణాలు మంజూరు చేయాలి

చండూరు: ఇంటి స్థలం ఉన్న నిరుపేదలందరికీ రూ.5 లక్షలు రుణం మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. శనివారం గట్టుప్పల మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం గట్టుప్పల మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నిక ముందు ఇంటి స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రుణం మంజూరు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, కర్నాటి సుధాకర్, కుక్కునూరు నగేష్, దోటి శేఖర్, పడసబోయిన యాదగిరి, ఎస్‌కే రిజ్వానా, వల్లూరి శ్రీశైలం, అచ్చిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ల ఆవిష్కరణ


పంచాయతీ కార్యదర్శుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి

నల్లగొండ: తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం నల్లగొండ జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం పట్టణంలోని డీపీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గణపురం నిరంజన్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే ఖాసీం, జిల్లా గౌరవాధ్యక్షుడు వీరబాబు, నర్సింహ, డాకు నాయక్, జిల్లా కన్వీనర్ కర్నాటి రాజు, పరమేష్, జానకిరాములు, ఏఓ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్..

నల్లగొండ టౌన్: బీసీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టరేట్ పరిపాలనాధికారి మోతీలాల్ శనివారం ల్యాండ్ సర్వే అధికారి మునాస శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్, ప్రధాన కార్యదర్శి కర్నె ఆనంద్‌కుమార్, కోశాధికారి వాడపల్లి సాయిబాబు, నేలపట్ల సత్యనారాయణ, కేశబోయిన శంకర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం


సభ్యత్వం అందజేస్తున్న కందాల ప్రమీల

శాలిగౌరారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని, రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల అన్నారు. మండల కేంద్రంలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ అనుబంధ ప్రజాసంఘాల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రైతుబంధు పథకాన్ని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పంటలను సాగుచేసి ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, ప్రజాసంఘాల ప్రతినిధులు కల్లూరి లింగయ్య, డెంకెల లింగయ్య, మక్క బుచ్చిరాములు, బట్ట లింగప్రసాద్, గుండ్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఘన సన్మానం


ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న దైద రవీందర్ తదితరులు

నకిరేకల్: భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామానికి వెళ్తూ నకిరేకల్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయనకు టీపీసీసీ నేత దైద రవీందర్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. చందుపట్ల–ఆరెగూడెంకు వెళ్లే దారిలో కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో కేతేపల్లి ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్, చందుపట్ల ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న, నాయకులు కొండ వెంకన్న, ముద్దం విజయ్, దేవులపల్లి వెంకన్న, కొప్పుల సత్తయ్య తదితరులు ఉన్నారు.

ఎల్‌ఈడీ టీవీలు, స్కూల్ బ్యాగులు అందజేత


బాబాసాహెబ్‌గూడెం పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీ ఇస్తున్న ఏవీఎం విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు

నకిరేకల్: పట్టణంలోని ఏవీఎం విద్యాసంస్థల అల్యుమినీ అసోసియేషన్ ఆఫ్ ఏవీఎం ఆధ్వర్యంలో శనివారం పలు ప్రభుత్వ పాఠశాలలకు రూ.2లక్షల విలువైన సామగ్రి అందజేశారు. బాబాసాహెబ్‌గూడెంలోని ప్రాథమిక పాఠశాల, నకిరేకల్ ప్రాథమిక పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీలు, మైక్ సెట్, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు, ఏవీఎం విద్యాసంస్థల చైర్మన్ కందాల పాపిరెడ్డి, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, వార్డు కౌన్సిలర్ కొండ శ్రీనుగౌడ్, అధ్యక్షుడు బ్రహ్మదేవర రమేష్, ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయురాలు పారిజాత, విద్యా కమిటీ చైర్మన్ సఫల నర్సింహ, అంగన్‌వాడీ కార్యకర్త లతీఫా, అసోసియేషన్ ప్రతినిధులు వీరవెల్లి రఘు, రామకృష్ణ, శ్రీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న చకిలం అనిల్‌కుమార్

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల కేంద్రంలో పునర్నిర్మించిన మహాలక్ష్మి దేవాలయంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చకిలం అనిల్‌కుమార్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిప్పర్తి మండలంలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొదటి నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పనిచేసిన వారికి అండగా ఉంటానని అన్నారు. ఆయన వెంట కన్నారావు, పల్లె రంజిత్‌కుమార్‌తేజశ్రీ, వెలుగుపల్లి శ్రీనివాస్, గుండు శ్రీనివాస్‌గౌడ్, బద్దం సైదులు గౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ వేయొద్దని వినతి


డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న చీకటిమామిడి గ్రామ రైతులు

మునుగోడు: తమ పట్టా భూముల మీదుగా మిషన్ భగీరథ పైపులైన్ వేయొద్దని కోరుతూ మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన పలువురు రైతులు శనివారం డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పట్టా భూముల నుంచి పైపులైన్ వేస్తే రానున్న రోజుల్లో తాము ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ఇబ్బందిగా మారుతుందని అన్నారు. ఇప్పటికే కొందరికి ఇళ్ల స్థలాల కోసం అమ్ముకున్నామని పేర్కొన్నారు. నల్లగొండ నుంచి వచ్చే పైపులైన్ అన్ని గ్రామాల్లో ఎలాగైతే రోడ్డు పక్క నుంచి అదేవిధంగా తమ గ్రామంలో వేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మేకల ముత్యంరెడ్డి, కుకునూరి రంగారెడ్డి, నకరకంటి యాదయ్య, వెంకటయ్య, పల్లె బుచ్చయ్య, పగిళ్ల సత్తయ్య, మారగొని అంజయ్య, కర్నాటి యాదయ్య, దుర్గయ్య తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లోకి నూతన కార్ల విడుదల


న్యూ ఆరా కారును విడుదల చేస్తున్న ఆర్టీఓ సురేష్‌రెడ్డి

నల్లగొండ రూరల్: పట్టణంలోని అద్దంకి–నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డులో గల హ్యుందాయ్ షోరూంలో శనివారం న్యూ ఆరా, న్యూ ఐ10 నియోస్ కార్లను నల్లగొండ ఆర్టీఓ సురేష్‌రెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఆరు అధునాతన రంగుల్లో, పూర్తి భద్రతా ప్రమాణాలతో కార్లను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్ల ప్రారంభ ధర రూ.6లక్షల నుంచి ప్రారంభమవుతుందని మార్కెటింగ్ సిబ్బంది తెలిపారు.

ఆడపిల్లలను చదివించాలి

మునుగోడు: మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను కూడా చదివించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని మండలంలోని కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు అన్నారు. బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల చేత మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆడపిల్లలకు రక్షణగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, నర్సింహ, పాండు, క్రిష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, మంజుల, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..


రాజకీయ నాయకులుగా వ్యవహరించిన గీతా విద్యాలయం విద్యార్థులు

చండూరు: పట్టణంలోని గీతా విద్యాలయంలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రిన్సిపాల్‌గా ఎం. హారిక, కరస్పాండెంట్‌గా బి. హాసిని, సీఎంగా ఎం. నాగరాజు, ఐటీ శాఖ మంత్రిగా కె. రేణుక, విద్యా శాఖ మంత్రిగా అనూష, మాజీ ఎమ్మెల్యేగా ఎండీ. సాజిత్ వ్యవహరించారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పోలోజు నరసింహాచారి విద్యార్థులతో ముచ్చటించి తమ బాల్య స్మృతులను వారితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పోలోజు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

మునుగోడు: మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మండలంలోని పలివెల గ్రామంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ఎంపీటీసీ చెరుకు క్రిష్టయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయని అన్నారు. ప్రతిఒక్కరూ తమకు నచ్చిన క్రీడలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మునుగోడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముడుపు శ్యాంరెడ్డి, మేడి హుస్సేన్, ఎస్‌ఎంసీ చైర్మన్ పూల వెంకన్న, శ్రీనివాస్, నిర్వాహకులు నవీన్‌రెడ్డి, బత్తుల సతీష్, భాస్కర్, స్వామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

లోతైన దుక్కులతో రైతులకు ప్రయోజనం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ, బేయర్ క్రాప్ సైన్స్ కంపెనీ ప్రతినిధులు

కేతేపల్లి: వేసవిలో రైతులు తమ పంట భూములను లోతుగా దుక్కి దున్నుకోవటం వల్ల ప్రయోజనకరంగా ఉంటుందని కేతేపల్లి ఏఓ బి. పురుషోత్తం అన్నారు. పత్తి పంట తీసిన తర్వాత పంట భూముల్లో చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ శాఖ, బేయర్ క్రాప్ సైన్స్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కేతేపల్లిలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎండాకాలంలో లోతైన దుక్కులు చేసుకోవటం ద్వారా పురుగు కోశస్థ దశలను నాశనం చేయవచ్చునని అన్నారు. పత్తి పంటకు నీళ్లు పెట్టి, ఎరువులు వేసి పంట కాలాన్ని పొడిగించవద్దన్నారు. జనవరి తర్వాత(200 రోజుల లోపు) ఎట్టి పరిస్థితుల్లో కూడా పత్తి పంటను చేలలో ఉంచొద్దన్నారు. ప్రస్తుతం పత్తి తీసిన భూముల్లో మిగిలిపోయిన మోళ్లను ట్రాక్టర్ లేదా రొటోవేటర్‌తో భూమిలో కలిసే విధంగా దున్నాలని సూచించారు. పత్తి తీసేసిన భూముల్లో పెసర, తెల్ల నువ్వులు, మొక్కజొన్న సాగు చేస్తే అదనపు ఆదాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బేయర్ క్రాప్స్ సైన్స్ కంపెనీ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఈఏఓ బాలరాజు, రైతులు రాము, రవి, లక్ష్మణ్, సందీప్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


వెంకన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లారీ డ్రైవర్లు

మునుగోడు: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన లారీ డ్రైవర్ కుటుంబానికి తోటి డ్రైవర్లు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన కట్లకుంట్ల వెంకన్న లారీ డ్రైవర్ పనిచేస్తూ గ్రామంలోని శ్రీలక్ష్మినర్సింహస్వామి లారీ డ్రైవర్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉన్నాడు. ఇటీవల అతడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో లారీ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు అందరూ కలిసి శనివారం వెంకన్న దశదిన కర్మకు హాజరై అతడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కట్లకుంట మల్లేష్, గంధం లింగస్వామి, బోయపల్లి రాజు, వెంకటేశ్వర్లు, రవి, రామకృష్ణ, మహేష్, శ్రీశైలం, సురేష్, ఉపేందర్, రాకేష్, లింగస్వామి, యాదయ్య, సాయిరాజ్ తదితరులు ఉన్నారు.


అంశాల స్వామి భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నేత చెరుకు సుధాకర్


నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం


నివాళులర్పిస్తున్న టీఆర్‌ఎస్ నాయకుడు కర్నాటి విద్యాసాగర్

చెర్వుగట్టు అభివృద్ధిలో ప్రభుత్వం విఫలం

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు దేవాలయానికి ప్రతి యేటా కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊషయ్య ఆరోపించారు. చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా శనివారం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. చెర్వుగట్టులో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే తప్ప ఈ ఎనిమిదేళ్లలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటికీ పనులన్నీ అసంపూర్తిగా వదిలేశారని, దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయన వెంట ఎంపీటీసీలు పాశం శ్రీనివాస్‌రెడ్డి, కొంపెల్లి సైదులు, చెర్వుగట్టు గ్రామ మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, దేవాలయ మాజీ చైర్మన్ పున్నంరాజ యాదగిరి, వరాల రమేష్, గడుసు శేఖర్‌రెడ్డి, రేగట్టె నవీన్‌రెడ్డి, రేగట్టె శ్వేత, కుకుట్ల ధనమ్మ, తదితరులు ఉన్నారు.